
## ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాం తంగా జరుగుతున్నాయి. శనివారం మూడో రోజు మొదటి సంవత్సరం పరీక్షలకు 8,556 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 8,068 మంది విద్యార్థులు హాజరయ్యారు. 488 మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌లో 8,241 మందికి 7,772 హాజరుకాగా 469 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 315 మందికి 296 మంది హాజరుకాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.


## నేటి నుంచి రోహిణి కార్తె

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): రోహిణి కార్తె వచ్చేసింది. హిందూమతంలో ఆధ్యాత్మిక పరంగా కూడా ఈ కార్తెకు ప్రాధాన్యం ఉంది. ఆదివారం 25వ తేదీ నుంచి తిరిగి జూన్ 8 వరకు ఈ కార్తె కొనసాగనుంది.



రోహిణి కార్తె అంటే సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించే కాలం. ఇది మే నెలలో వస్తుంది. రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయి లేదా సాయంత్రం వచ్చే గాలి దుమారంతో కూడిన అకాల వర్షాలకు రోళ్లు నిండుతాయని అంటారు. ఈ సమయంలో సూర్య కిరణాలు భూమిపై నేరుగా పడటం వల్ల ఎండలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఈసారి నైరుతి ఋతుపవనాలు కాస్త త్వరగా వస్తుండడంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఉదయం వాతావరణం ఎండగా, తేమగా, పొడిగా ఉంటూ సాయంత్రం చల్లబడే అవకాశం ఉంది. ఈ కార్తెలోనే రైతులు నార్లు పోసుకుని వానాకాలం వ్యవసాయానికి శ్రీకారం చుడతారు.

# బకాయిల ఊబిలో విద్యుత్‌శాఖ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

విద్యుత్ శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు గుదిబండగా మారాయి. స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, హెల్త్ డిపార్ట్‌మెంట్, పోలీస్ శాఖల్లో సైతం పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలో వివిధ సంస్థలు, ప్రభుత్వ శాఖలు ఎన్‌పీడీసీఎల్‌కు 3,599 కోట్ల 97 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉన్నది. ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల బకాయిలు 3,460 కోట్ల 75 లక్షల 60 వేలు ఉండగా మిగతా శాఖలు కలిపి 139.21 కోట్ల రూపాయలు ఉన్నాయి. మున్సిపల్ శాఖ 86.16 కోట్లు, పంచాయతీరాజ్‌శాఖ 39.94 కోట్లు బకాయిలుగా చెల్లించాల్సి ఉంది. నెల వారీగా చెల్లించే విధానం లేకపో వడంతో ప్రభుత్వ శాఖల బకాయిలు పేరుకుపోతున్నాయి. బకాయిలను దశలవారీగా చెల్లించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులను కోరుతున్నామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిధిలోని ఇతర వినియోగాల నిమిత్తం నెలనెలా వచ్చే బిల్లులకు పొంతన లేకుండా చెల్లింపులుంటున్నాయని, దీంతో ప్రతి నెలా పెండింగ్ బకాయిలు ఉంటాయని, అవి పేరుకుపోయి సంస్థకు భారంగా మారాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా శాఖల్లో సంబంధిత పద్దు కింద నిధులు విడుదలైతే తప్ప బిల్లులు చెల్లించే పరిస్థితి ఉండదు. ప్రభుత్వ కార్యాలయాలు కావడంతో నోటీసులివ్వడం తప్ప డిస్ కనెక్ట్ చేయలేని పరిస్థితి. గృహ వినియోగదారులు, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర వినియోగదా రులకు వర్తింపజేసినంత కఠినంగా బిల్లుల చెల్లింపునకు ఈ శాఖలపై ఒత్తిడి చేయలేని పరిస్థితి ఉంది.

### ● శాఖల వారీగా బకాయిలు

గ్రంథాలయాలు 0.55 లక్షలు, వ్యవసాయం 16.17 లక్షలు, ఎనిమల్ హస్బెండరీ 1.7 లక్షలు, ఆర్టీసీ 41 వేలు, సెంట్రల్ గవర్నమెంట్ 2.6 లక్షలు, చైల్డ్ వెల్ఫేర్ 1.92 లక్షలు, కో-ఆపరేటివ్ 69 వేలు, విద్యాశాఖ 16.71 లక్షలు, ఎండోమెంట్స్ 36 వేలు, ఫిషరీష్ 1.1 లక్షలు, ఫారెస్ట్ శాఖ 6.71 లక్షలు, హెల్త్ డిపార్ట్‌మెంట్ 5 కోట్ల 16 లక్షల 57 వేలు, ఇన్‌కం టాక్స్ శాఖ 1.74 లక్షలు, ఇరిగేషన్, మిషన్ భగీరథ 3,460 కోట్ల 75.60 లక్షలు, ఐటీ, కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ 74 వేలు, జుడిషియల్ 41 వేలు, లేబర్ డిపార్ట్‌మెంట్ 15.31 లక్షలు, మైనార్టీ వెల్ఫేర్ శాఖ 3.87 లక్షలు, మున్సిపాలిటీ 86.16కోట్లు, పంచాయతీరాజ్‌శాఖ 39.94 కోట్లు, పోలీస్‌శాఖ 2.29 కోట్లు, ఆర్అండ్‌బి 28.84 లక్షలు, రైతు వేదిక 7.52 లక్షలు, రిజిస్ట్రేషన్ శాఖ 6.23 లక్షలు, రెవెన్యూశాఖ 4 కోట్ల 44 లక్షల 16 వేలు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ 38 వేలు, స్పోర్ట్స్ 2.4 లక్షలు, తెలుగు అకాడమీ 11 వేలు, ట్రెజరీ 12 వేలు, ఉర్దూ అకాడమీ 60 వేలు, వెటర్నరీ 4.80 లక్షలు, విద్యుత్ బకాయిలు మొత్తం 3,599 కోట్ల 97 లక్షల 47 వేల రూపాయలు ఉన్నాయి.

### ● పాలకవర్గాలు లేక పేరుకుపోతున్న బకాయిలు

జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిల్లో అత్యధికంగా స్థానిక సంస్థలైన పంచాయతీలు, మున్సిపాలిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖల్లో ఉన్నాయి. ప్రధానంగా మున్సిపాలిటీలో పెండింగ్ బిల్లులు అత్యధికంగా 86 కోట్ల 16 లక్షల 91 వేల రూపాయలు దాటాయి. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు సంబంధించి కార్యాలయాలు, తాగునీటి పథకాలు, వీధి దీపాల నిర్వహణకు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది.

(మిగతా 8వ పేజీలో)

● ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు రూ.3,599.97కోట్లు
● ఇరిగేషన్, మిషన్ భగీరథ రూ. 3,460.75 కోట్లు
● మున్సిపల్ శాఖ రూ. 86.16 కోట్ల బాకీ
● పంచాయతీరాజ్ శాఖ రూ. 39.94 కోట్లు
● ప్రతి నెలా చెల్లించే విధానం ఉండాలంటున్న విద్యుత్‌శాఖ

## తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలి



కరీంనగర్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శనివారం నగరంలోని కళాభారతిలో పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాటాడుతూ నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపర్చాలన్నారు. నగర పరిసర ప్రాంతాలతో పాటు చెత్త కలెక్షన్ పాయింట్ల వద్ద చెత్త కనిపించకుండా స్వీపింగ్ చేసి చెత్తను తరలించాలన్నారు. డివిజన్ల వారీగా ఏరియాల్లో పరిసర ప్రాంతాల్లో చెత్త కనిపించకూడదని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో చాలా మార్పులు తెచ్చి నగరాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచా లన్నారు. ప్రతి రోజు స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటికి తిరిగి తప్పకుండా చెత్తను వేరుగా సేకరించాలని కోరారు. చెత్తను తడి పొడిగా వేరు చేయకుండా ఇస్తే తీసుకోమని గృహిణులకు తెలుపాలని, చెత్తను వేరు చేసిన తర్వాతే కార్మికులు స్వీకరించాలన్నారు. ఉదయం డివిజన్లలో చెత్త సేకరణ సమయంలో సౌండ్ సిస్టమ్ తప్పనిసరిగా పాటించాలని కోరారు. మైక్‌లు చెడిపోయాయని చాలా ఫిర్యాదులు వచ్చాయని చెడిపోయిన మైక్‌లను వెంటనే రిపేర్ చయాలని కోరారు. కొన్ని స్వచ్ఛ ఆటోలలో మైనర్ బాలురు డ్రైవింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. మైనర్లతో, లైసెన్స్ లేని వారితో స్వచ్ఛ ఆటోలను నడిపించే చర్యలకు పాల్పడవద్దని, మళ్లీ మా దృష్టికి వస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తడి చెత్తను నగరపాలక సంస్థ వర్మి కంపోస్టు కేంద్రాలకు తరలించాలని అన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే ఊరుకోమన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య కార్యక్రమాలు చాలా మెరుగ్గా సాగేలా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, వెటర్నరీ అధికారి, ఎస్ఐలు, జవాన్లు, స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## అరకొరగా జీలుగ విత్తనాలు

● స్టాక్ వచ్చిన కొద్ది గంటల్లోనే పూర్తి ● ఇబ్బంది పడుతున్న రైతులు



తీగలగుట్టపల్లి డీసీఎంఎస్ ఎదుట విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంట సాగుకు సన్నద్ధమైన రైతులకు జీలుగ, జనుము విత్తనాల కోసం పడిగాపులు తప్పడం లేదు. పంట వేసే నెల రోజుల ముందే జీలుగ, జనుము విత్తనాలను పొలంలో చల్లుతారు. విత్తనాలు వచ్చాయని శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు సమాచారం ఇవ్వడంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. కోటా ప్రకారం నగునూర్‌కు వచ్చిన విత్తనాలు గంటలోపే ముగిసాయి. తీగలగుట్టపల్లిలో డీసీఎంఎస్ షాప్ ముందు ఉదయం నుంచే రైతులు పడిగాపులు కాశారు. కరీంనగర్ మండలానికి 130 క్వింటాళ్ల జీలుగ, 80 క్వింటాళ్ల జనుము స్టాక్ వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. కానీ నగునూర్‌లోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో 30 క్వింటాళ్ల జీలుగ, 50 క్వింటాళ్ల జనుము స్టాక్ రావడంతో ఉన్న రైతులకు ఇచ్చి పంపించారు. తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్‌లో 50 క్వింటాళ్ల జీలుగ కేటాయిచంగా శనివారం సాయంత్రం స్టాక్ వచ్చింది. కరీంనగర్ డీసీఎంఎస్‌కు ఇంకా స్టాక్ రాకపోవడంతో రైతులు ఎదురు చూపులు తప్పం లేదు. రైతుల డిమాండ్ మేరకు ఇండెంట్‌లు పెడుతున్నామని స్టాక్ వచ్చిన వెంటనే అందజేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి బి సత్యం తెలిపారు. ఆదివారం అన్ని కేంద్రాల నుంచి రైతులకు విత్తనాలను అందిస్తామని తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

● మూడేళ్లు కష్టపడితే 30 ఏళ్ల నికర ఆదాయం
● కలెక్టర్ పమేలా సత్పతి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఈ సాగులో ఆయిల్ పామ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. లోహియా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై 'బంగారు రైతు' అవగాహన కార్యక్రమాన్ని కరీంనగర్‌లోని కేఎస్ఎల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడారు. కేవలం వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలని అన్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉండే పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఒక సీజన్‌లో వరి వేస్తే మరో సీజన్‌లో ప్రత్యామ్నాయ పంట వేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలలో ఆయిల్ పాం సాగు ప్రయోజనకరమైనదని తెలిపారు. ఈ పంటలో అంతర పంట కూడా సాగు చేయవచ్చని అన్నారు. మూడు సంవత్సరాల పాటు కష్టపడితే 30 సంవత్సరాల నికర ఆదాయం ఈ పంట ద్వారా చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలకు ఎకరానికి 51 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎకరానికి 22,500 రూపాయల సబ్సిడీ బిందు సేద్యం కోసం అందిస్తుందని వివరించారు. జిల్లాలో కేవలం 320 మంది రైతులు మాత్రమే 1,200 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని అన్నారు. ఈ సాగు విస్తీర్ణాన్ని ఈ ఏడాది 3 వేల ఎకరాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ ద్వారా రైతులు లాభాలను ఆర్జించవచ్చని అన్నారు. లోహియా కంపెనీ సీఈఓ సిద్ధాంత్ లోహియా మాట్లాడుతూ జిల్లాలో విలేజ్ అవుట్ రీచ్ కార్యక్రమం ద్వారా ప్రతి రైతును కలిసి బంగారు రైతుగా మార్చేందుకు లోహియా గ్రూపు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పంటసాగు చేసే రైతులకు గోల్డ్ స్కీమ్, బంపర్ లక్కీడ్రా గురించి రైతులకు వివరించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేటలో సెప్టెంబరు 4వ తేదీన ఫ్యాక్టరీ శంకుస్థాపన చేయనున్నట్లు సీఈఓ తెలిపారు. జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఏడాదికి 4 నుంచి 6 లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, లోహియా సంస్థ సీఈవో సిద్ధాంత్ లోహియా, ప్రతీక్ పట్నాయక్, కరీంనగర్ ఇన్‌చార్జి భరత్ తదితరులు పాల్గొన్నారు.



## సరస్వతి పుష్కరం.. సకలజన హితం..

● త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం
● పదోరోజు 2 లక్షలకు పైగా హాజరైన భక్తులు

6

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె వెంకటేశ్




మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు కె వెంకటేశ్

కరీంనగర్ క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె వెంకటేశ్ అన్నారు. కరీంనగర్ జిల్లా జైలులో ఖైదీలకు భోజన వసతితో పాటు ఇతర మౌలిక వసతులను శనివారం ఆయన పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి భోజనం, యోగక్షేమాలు, న్యాయ సేవలు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిక్షలు పడిన ఖైదీలు హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ఆసక్తి కలిగిన వారి వివరాలను తెలుసుకున్నారు. ప్రైవేట్ న్యాయవాదిని నియమించుకునేందుకు స్తోమత లేనివారికి న్యాయసహాయం కోసం ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. అనంతరం జైలులోని క్యాంటిన్, ఆసుపత్రి, ములాఖత్ గది, లైబ్రరీ, వంటశాల, జైలులోని ఇండస్ట్రీలను ఆయన పరిశీలించి, పనితీరు బాగుందని అభినందించారు. మహిళా జైలును సందర్శించి మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి విజయ్‌డేని, జైలర్లు పి శ్రీనివాస్, బీ రమేష్, డిప్యూటీ జైలర్‌లు ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రమేష్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్లు తనుకు మహేష్, టి పరుశరాం, ఎస్ మల్లేశం, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్లు, జైలు గార్డింగ్ సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

● ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి
● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య




మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య

భగత్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదాన్ని తుద ముట్టించి మత సామరస్యతను కాపాడాలని, ఛత్తీస్‌గడ్‌లో జరుపుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య అన్నారు. శనివారం సుగుణాకర్‌రావు భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా 'పహెల్గాం ఉగ్రదాడి-అనంతర పరిణామాలు' అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరయ్య మాట్లాడుతూ పహెల్గాం ఉగ్రదాడి దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఉగ్రదాడిలో అమాయక పర్యాటకులు చనిపోయారన్నారు. పర్యాటక ప్రాంతంలో భద్రత ఎందుకు కల్పించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భావోద్వేగాలను కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కాశ్మీర్ ముస్లింలే పర్యాటకులను కాపాడారని, రైల్వే, ఎయిర్‌పోర్టులకు ఉచితంగా పర్యాటకులను చేరవేశారన్నారు. అదే కార్పొరేట్ శక్తులు ఎయిర్‌లైన్స్‌లో 6 వేలు ఉన్న టికెట్‌ను 60 వేలకు పెంచారన్నారు. ఈ ఉగ్రదాడిలో ఒక ముస్లిం హార్స్ రైడర్ చనిపోయారన్నారు. మత కల్లోలాలు సృష్టించాలని చూస్తే కాశ్మీర్ ముస్లిం ప్రజలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా రోడ్ల మీదకు వచ్చి పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినదించి మూడు రంగుల జాతీయ జెండాలతో భారీ ర్యాలీ ఎలా తీశారని గుర్తు చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో శాంతిభద్రతల సమస్యగా చూపెడుతూ అడవి ప్రాంతం నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టే లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు ప్రజలంతా ఉద్యమించాలన్నారు. ఈ సెమినార్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, ఎడ్ల రమేష్, జి రాజేశం, కోనేటి నాగమణి, జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, జి తిరుపతి నాయక్, కొంపెల్లి అరవింద్, రాజమల్లు, నరసింహారెడ్డి, రామ్మోహన్, శ్రీధర్, మాతంగి శంకర్, పుల్లెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీకొట్టిన క్రేన్

● ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గొల్లపల్లి గ్రామ శివారులో శనివారం కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కారును క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన బెజ్జంప్రకాష్ అతడి కుమారుడు బెజ్జం సుధీర్ ఇద్దరు వేములవాడకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామశివారు దగ్గర ఎదురుగా వస్తున్న క్రేన్, కారును ఢీకొట్టింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రకాష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం అందించారు. ప్రథమచికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ గీత కార్మికుడు శుక్రవారం రాత్రి తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన బాలగోని రాములు వృత్తిలో భాగంగా కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీతకార్మికులు 108కు, కుటుంబసభ్యులకు సమాచారం అదించారు. చికిత్సనిమిత్తం రాములును హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

## వేములవాడలో మూడిళ్లలో చోరీ

వేములవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు ఇళ్లలో చోరీ జరిగింది. సాయినగర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలోని ఒక కిరాణా దుకాణం తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగ ఐదు వేల రూపాయల నగదు అపహరించినట్లు తెలిసింది. పక్కనే ఉన్న మరో ఇంట్లో చీరల దుకాణం నిర్వహిస్తుండగా, ఆ ఇంట్లోకి ప్రవేశించిన దొంగ చీరలు ఎత్తుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకరి ఇంట్లో రెండు తులాల బంగారం, మరొకరి ఇంట్లో ఒక తులం బంగారం చొప్పున ఎత్తుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఇంట్లోని వారు తాళం వేసి ఊరికి వెళ్లినట్లు గమనించిన దొంగ ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, సాయినగర్ ప్రాంతంలో వారంరోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయినగర్‌లోని తాళం వేసిఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగిందని మొత్తం మూడుతులాల బంగారం, 5000 రూపాయల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

## జనరల్ స్టోర్‌లో చోరీ

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ జనరల్ స్టోర్‌లో శనివారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన కారుకూరి శ్రీనివాస్ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. స్టోర్‌కు శుక్రవారం సాయంత్రం యథావిధిగా తాళం వేసి వెళ్లాడు. తెల్లవారుజామున పేపర్‌బాయ్ షాపు తెరిచి ఉందని శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. శ్రీనివాస్ షాపు వద్దకు వచ్చి చూడగా, క్యాష్ కౌంటర్‌లోని రూ.17వేల నగదు, రూ.20వేల విలువ చేసే జనరల్ స్టోర్ సామగ్రి, 5 హెల్మెట్‌లను దొంగలు దోచుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

# సరస్వతి పుష్కరం.. సకలజన హితం



గోదావరిలో దీపాలను వదులుతున్న భక్తులు



- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం
- పదో రోజు 2 లక్షలకుపైగా హాజరైన భక్తులు

కాళేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కర సంబరం సాగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి అశేష భక్తజనం కాళేశ్వర క్షేత్రానికి పోటెత్తుతున్నారు. శనివారం పదో రోజు వివిధ ప్రాంతాలనుంచి సుమారు 2 లక్షలపైచిలుకు భక్తులు కాళేశ్వరంలో పుష్కర స్నానాలు ఆచరించి ముక్తీశ్వరుడిని కృపకు పాత్రులయ్యారు. భక్తులు రద్దీ అధికమై దర్శనానికి గంటలకొద్దీ సమయం పట్టడంతో క్యూలైన్‌లో వేచిచూడలేని భక్తులు కొంత మంది పుష్కర స్నానాలతో సరిపెట్టుకొని వెనుదిరిగి వెళ్లారు. పార్కింగ్ స్థలాలు సుదూరంగా ఉండటంతో కొంత మంది వాహణదారులు ఇబ్బందులు పడ్డారు. పలువురు ప్రముఖుల కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పుష్కర స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆది, సోమ రెండు రోజులతో పుష్కరాలు ముగియనుండటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే ఛాన్స్ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సర్వసతి పుష్కరాల పదో రోజులో భాగంగా శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఅండ్ఎండీ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వరాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన 10రోజుల్లోనే 10 లక్షల పైచిలుకు మంది భక్తజనం పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరసాన్నం ఆచరించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం రానున్నారు.



ఎడ్లబండ్లపై పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు



## కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తులు

మల్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. హనుమాన్‌జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకపూజలు, సత్యనారాయణ వ్రతాలుచేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

● పెద్ద జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20నుంచి 22వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానంకు రూ.1,51,72,470 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.30,56,100, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.8,51,450, ప్రత్యేక దర్శనం రూ. 23,04,800 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.79,14,200ల లడ్డు విక్రయాలు, రూ.10,45,920ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1,51,38,490 ఆదాయం సమకూరింది.

## డీడీఎన్ పథకానికి ముగిసిన గడువు

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో అర్హతకలిగిన దేవాలయాలకు దూప,దీప,నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్రప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ మే1న నోటిఫికేషన్ జారీచేసింది. కాగా శనివారం సాయంత్రంతో ఈ దరఖాస్తుల సమర్పణకు గడువు ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు సుమారు 300వరకు దరఖాస్తులు అందగా వాటిని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయకమిషనర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, అర్చకసంఘం నుంచి ఒక వ్యక్తిని తీసుకొని త్రీమెన్‌కమిటీగా ఏర్పడిఆలయాలను ఎంపిక చేయనున్నారు. ఎన్నికైన ఆయాఆలయాలకు నెలకురూ.4వేలు ధూప,దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవభృతి కింద రూ.6వేలు చెల్లించనున్నారు. ఎంపిక విషయంలో పారదర్శకత పాటిస్తామని వదంతులు నమ్మవద్దని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

## ద్విచక్రవాహనాలు ఢీ.. వృద్ధుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామం సబ్‌స్టేషన్ వద్ద వద్ద శనివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్రా అలియాస్ గడ్డి బుచ్చయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణం సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో పనిచేసే కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో పెద్దూరుకు చెందిన బుచ్చయ్యకు తీవ్రగాయాలయ్యాయి. బుచ్చయ్యను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, పెద్దూరు గ్రామస్థులు ఆందోళన చేస్తారనే సమాచారం మేరకు జిల్లా ఆసుపత్రి పోస్టుమార్టం గది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

## డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురి డీబార్

గణేశ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): శాత వాహనవిశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగు తున్న డిగ్రీ రెండోసెమిస్టర్ పరీక్షల్లో శనివారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీకళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, అపూర్వ (ఉమెన్స్) డిగ్రీకళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ (ఉమెన్స్) డిగ్రీకళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటి డిగ్రీకళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డీబార్ అయినట్లు వివరించారు.

## తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

ముస్తాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంచెందిన ఓవిద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన స్నేహిత(16) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో తన స్నేహితుల కంటే తక్కువ మార్కులు వచ్చాయని కొద్దిరోజులుగా స్నేహిత బాధపడుతోంది. ఈక్రమంలో శనివారం తల్లిదండ్రులు పక్క ఊరిలోని బంధువుల ఇంటికి వెళ్లగా స్నేహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేసి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.25,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది జూదరులు పట్టుబడగా మరోముగ్గురు పారిపోయారు. పట్టుబడిన వారిని గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపతి రవిందర్ తెలుపగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ అరుణ్ తెలిపారు.

## ఖాసింపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పిడుగుపాటు

● స్వల్పంగా ధ్వంసమైన ఎల్‌టీ విద్యుత్‌పరికరాలు, ప్యానెల్ బోర్డు


గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షంతో పాటు ఖాసింపేటలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో చింతచెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. పిడుగుపాటుకు సబ్‌స్టేషన్‌లోని ఎల్‌టీ లైన్, అలారం ప్యానెల్ బోర్డు ధ్వంసం అయ్యాయి. దీంతో అర్ధరాత్రినుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం హుటాహుటిన విద్యుత్‌అధికారులు రంగంలోకి దిగినూతన ప్యానెల్‌బోర్డు, ఎల్‌టీలను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న జిల్లా విద్యుత్ అధికారులు ఎస్‌సి రమేష్‌బాబు, డీఈ తిరుపతి, మండల ఏఈ అంజనేయులు సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు.

మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సకాలంలో స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించిన విద్యుత్ అధికారులను గ్రామస్థులు, రైతులు అభినందించారు.

## పిడుగుపాటుతో ఎద్దులు మృతి

గంగాధర, మే 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో శనివారం ఉదయం పిడుగుపడి రెండు ఎడ్లు మృతిచెందాయి. గ్రామానికి చెందిన దెశెట్టి వీరమల్లయ్య కాడెద్దులతో వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం రెండు పశువులను రేకుల షెడ్డు వద్ద ఎప్పటిలాగే కట్టేశాడు. శనివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో షెడ్డుపై పిడుగువేసింది. దీంతో షెడ్డులో కట్టేసిన రెండు పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఉదయం షెడ్డు వద్దకు వెళ్లిన రైతు వీరమల్లయ్య మృతి చెందిన పశువులను చూసి బోరున విలపించాడు. పశువుల విలువ సుమారు 1.50లక్షలు ఉంటుందని గ్రామ రైతులు తెలిపారు.

- అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర
- నేడు థైరాయిడ్ డే





# జీవక్రియ నియంత్రణలో కీలకం





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మానవ శరీరంలో రసాయన జీవక్రియలను నియంత్రించడంలో థైరాయిడ్ గ్రంధి ఎంతో కీలకమైంది. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు శరీర మార్పులు చేయడంలో, అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే ప్రస్తుతం థైరాయిడ్ సమస్య ప్రపంచాన్ని పట్టి పీడిస్తోంది. అన్ని దేశాల్లోనూ ప్రజలు థైరాయిడ్ సమస్యతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి అవగాహన పెంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 25న థైరాయిడ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. థైరాయిడ్‌లో ఉండే కణాలు రక్తం నుంచి అయోడిన్‌ను గ్రహించి టైరోసిస్ అనే అమైనో యాసిడ్‌తో పాటు మరికొన్ని ఎంజైమ్‌ల సహాయంతో థైరాయిడ్ హార్మోన్లు టీ3, టీ4 వంటివి ఉత్పత్తి చేస్తాయి. ఈ టీ3, టీ4 హార్మోన్ల ఉత్పత్తిని నియంత్రించడానికి పిట్యూటరీ అనే గ్రంథి థైరాయిడ్ సిమ్యూలేటివ్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ థైరాయిడ్ టీ3, టీ4 హార్మోన్లు శరీరంలోని కొన్ని ప్రధానమైన జీవక్రియ జరిగేందుకు దోహదపడుతుంది. మన శరీరాన్ని చురుకుగా ఉంచడానికి తోడ్పడుతుంది. టీ3, టీ4 రక్తంలో హార్మోన్ల మోతాదు తగ్గితే కొన్ని సంకేతాలు పిట్యూటరీ గ్రంథికి చేరి అక్కడినుంచి టీఎస్‌హెచ్ హార్మోన్ ఎక్కువగా విడుదలయ్యేలా చేస్తుంది. దానివల్ల రక్తంలో టీఎస్‌హెచ్ మోతాదు పెరుగుతుంది. అప్పుడు రక్తంలో టీ3, టీ4 హార్మోన్ల మోతాదు పెరిగితే పిట్యూటరీ గ్రంథి నుంచి వచ్చే టీఎస్‌హెచ్ మోతాదు తగ్గుతుంది. దీంతో ఆ గ్రంథికి సంబంధించిన సమస్య వస్తుంది.

### పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు...

\- డాక్టర్ ఎ జైలొసింగ్(ఎండీ)



మానవ జీవక్రియల నియంత్రణలో కీలకపాత్ర పోషించే థైరాయిడ్ సమస్య వచ్చిందని పరీక్షల ద్వారా తెలుసుకొని మందులు వాడడం చాలా మంచిది. అశ్రద్ధ చేస్తే జీవక్రియలన్నీ సక్రమంగా పనిచేయవు. వైద్యుల సలహా మేరకు మందులు వాడడమే శ్రేయస్కరం. థైరాయిడ్ పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు. తల్లికి ఉంటే బిడ్డకు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పుట్టిన వెంటనే తల్లికి ఉన్నట్లయితే థైరాయిడ్ పరీక్షలు చేసి చికిత్సలు ప్రారంభిస్తే ఫలితం ఉంటుంది. లేదంటే పిల్లల్లో ఎదుగుదల మెదడు ఎదగకపోవడం వంటి సమస్యలు వస్తాయి. పెద్దవాళ్లు కూడా రకరకాల సమస్యలను ఎదుర్కొంటారు. నిరంతరం మందులు వాడడం మంచిది.

● థైరాయిడ్ సమస్యలు రెండు రకాలు..

హార్మోన్లు తగ్గడాన్ని హైపో థైరాయిడిజం అని, అవసరాన్ని మించి ప్రసవించడాన్ని హైపర్ థైరాయిడిజం అని లేదా థైరోట్యాక్సికోసిస్ అంటారు. హైపో థైరాయిడిజానికి అయోడిన్ లోపం సమస్య, హైపర్ థైరాయిడిజానికి రక్తంలో థైరాయిడ్ గ్రంథి యాంటీ బాడీస్ ఏర్పడడం. దీనిని హైపో ఇమ్యూన్ హైపోథైరాయిడిజం అంటారు. వీటిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

## దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపెల్లివద్ద శుక్రవారం మహిళను బెదిరించి ఆమె వద్ద నుంచి 4 వేల రూపాయలు దోచుకున్న ఘటనలో నిందితుడు సందీప్‌ను శనివారం అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా ఆమెను చంపుతానని బెదిరించి రూ.4వేలు బలవం తంగా తీసుకొని సందీప్ పారిపోయినట్లు చెప్పారు.

చింతకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో సందీప్‌ను ఎస్సై సాంబమూర్తి అరెస్టు చేసినట్లు, రూ.3,500నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని మహిళ(40) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వెంకటాపూర్ గ్రామ శివారులో మహిళ రోడ్డు దాటుతున్న క్రమంలో ఈనెల23న రాత్రి ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపు స్కూటీపై వెళుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రగాయాల పాలైన మహిళను స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. మహిళ ఒంటిపై గులాబీరంగు నైటీ, ఆమె రెండు చేతులపై హిందీలో 'బీ మాతా' అని పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ప్రొబేషనరీ ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే తమను సమాచారం అందించాలని ఆయన కోరారు.



# ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

# పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

## రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లి‌స్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

**స్టొయినిస్ ధనాధన్:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

### స్కోరుబోర్డు

**పంజాబ్:** ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

**ఢిల్లీ:** రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

### నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి, వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి, వేదిక: ఢిల్లీ

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 13 | 9 | 4 | 0 | 18 | 0.602 |
| పంజాబ్ | 13 | 8 | 4 | 1 | 17 | 0.327 |
| బెంగళూరు | 13 | 8 | 4 | 1 | 17 | 0.255 |
| ముంబై | 13 | 8 | 5 | 0 | 16 | 1.292 |
| ఢిల్లీ | 14 | 7 | 6 | 1 | 15 | 0.011 |
| లఖ్‌నవూ | 13 | 6 | 7 | 0 | 12 | -0.337 |
| కోల్‌కతా | 13 | 5 | 6 | 2 | 12 | 0.193 |
| హైదరాబాద్ | 13 | 5 | 7 | 1 | 11 | -0.737 |
| రాజస్థాన్ | 14 | 4 | 10 | 0 | 8 | -0.549 |
| చెన్నై | 13 | 3 | 10 | 0 | 6 | -1.030 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



# నవతరం నాయకుడు వచ్చాడు

## శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్



అర్ష్‌దీప్

సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్‌ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

### ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



### నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.



5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



### బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

ఇక

## 'శుభ్' ఆరంభం!

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఎ' తరపున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్వీందర్ కృషి ఎనలేనిది. కొడుకు దృష్టంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.



### ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటున్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

# '25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పావోలినీ, రెండో సీడ్ కొకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

### షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

### ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

# ఖరీదైన బహుమతులు వచ్చాయా...



## ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింద పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

**వీరికి మినహాయింపు:** ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

**ఇతరుల నుంచి వస్తే:** ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

**ఎవరు బంధువులు:** ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

### పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్టులు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్టులు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్టులు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

### రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

# బిజినెస్ ప్లస్

## క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపం లోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

### జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

**చార్జీలు**

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

**వడ్డీ రేటు**

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

**లేటు చెల్లింపులు వద్దు**

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

**పరిమితులు**

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువు లోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



## ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | విజయవాడ | 119 |
| వరంగల్ | 120 | గుంటూరు | 122 |
| కరీంనగర్ | 120 | ఒంగోలు | 122 |
| మహబూబ్‌నగర్ | 120 | చిత్తూరు | 111 |
| కర్నూలు | 120 | నెల్లూరు | 116 |
| విశాఖపట్నం | 116 | అనంతపురం | 116 |
| గోదావరి | 119 | | |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 25వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 500 | విజయవాడ | 510 |
| వరంగల్ | 502 | గోదావరి | 485 |
| చిత్తూరు | 603 | విశాఖపట్నం | 513 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 98,080 ▲ | 89,900 ▲ | 1,10,900 ▼ |
| విజయవాడ | 99,700 ▲ | 93,500 ▲ | 99,700 ▼ |
| విశాఖపట్నం | 98,080 ▼ | 89,900 ▲ | 1,10,900 ▲ |
| రాజమండ్రి | 98,070 ▲ | 89,900 ▲ | 1,03,000 ▲ |
| ప్రొద్దుటూరు | 96,200 ▼ | 88,500 ▼ | 99,200 ▼ |
| ముంబై | 95,471 | 87,451 | 96,909 |

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్

కరీంనగర్ అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): మైనార్టీ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ అన్నారు. శనివారం కరీంనగర్ పర్యటనకు వచ్చిన ఆయన ఆర్అండబీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. పేదలకు సహాయ సహకారాలు అందించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ముందువరుసలో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మైనార్టీలు చదువుపై దృష్టి సారించాలని, చదువుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయం అందిస్తోందని అన్నారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజ్, టీపీసీసీ కార్యదర్శి సమద్‌నవాబ్, యువజన కాంగ్రెస్ కరీంనగర్ మాజీ అధ్యక్షుడు రహమాన్ పాల్గొన్నారు.

# ధర్మ రక్షణ కోసం పాటుపడుదాం

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ధర్మ రక్షణ కోసం ప్రతీ ఒక్కరం పాటుపడదామని, ఇందు కోసం 40 ఏళ్లుగా బజరంగదళ్ కృషి చేస్తోందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఇనుగంటి మధుసూదన్‌రావు, భజరంగదళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్‌కుమార్ అన్నారు. ఈ నెల 18 నుంచి కొనసాగుతున్న రాష్ట్ర భజరంగదళ్ శౌర్య ప్రశిక్షణ వర్గలో భాగంగా శనివారం జ్యోతీనగర్ వాణీని కేతన్ పాఠశాల నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ శిశుమందిర్ వరకు కార్యకర్తలు పథ సంచలన్ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని యువతను శారీరకంగా, మానసికంగా తీర్చిదిద్దడంతోపాటు లవ్ జిహాద్, మతమార్పిడుల కట్టడి, గో సంరక్షణ కోసం ఈ వర్గను నిర్వహించామన్నారు. బజరంగదళ్ అఖిల భారతీయ కన్వీనర్ నీరజ్ దోరియా, అఖిల భారతీయ కేంద్రీయ సయుక్త కార్యదర్శి స్తానో మలయన్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా కన్వీనర్ శంకర్, కుమారస్వామి, శివరాములు, అశోక్, ఆంజనేయులు, మహేశ్, రాజేందర్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

# బకాయిల ఊబిలో విద్యుత్ శాఖ

(5వ పేజీ తరువాయి)

దీంతో ఈ సంస్థల పద్దుల కింద కనెక్షన్లకు విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. అయితే వీటికి పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచాయి. ఫలితంగా ఈ సంస్థల విద్యుత్ బిల్లుల చెల్లింపు సామర్థ్యం తగ్గింది. గ్రామ పంచాయతీలతో పోల్చితే మున్సిపాలిటీలకు ఆస్తి, ఇంటి పన్నుల వసూళ్లతో కొంత రెవెన్యూ వస్తుండ గా వాటిని అత్యవసర పనులకు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ బిల్లులు వస్తుంటే విద్యుత్ సంస్థకు చెల్లించేది తక్కువే. మిగిలిన బిల్లు పెండింగ్‌లో ఉంటోంది. గ్రామ పంచాయతీలకు నెలనెలా సుమారు 3.61 కోట్ల రూపాయల వరకు బిల్లులు వస్తుంటే అందులో కేవలం రెండు మూడు లక్షల వరకే చెల్లింపులు ఉంటు న్నాయి. మున్సిపాలిటీవి 86 కోట్ల రూపాయల పైచిలుకు పెండింగ్ ఉండగా గ్రామ పంచాయతీలవి 39 కోట్ల రూపాలయకు పైనే పెండింగ్ బిల్లులు ఉన్నాయి.

## సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలి

**- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు**

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల్లో విద్యుత్ బిల్లులు కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు వెంటనే పెండింగ్ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలి. విద్యుత్ సం స్థను కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందని ప్రభుత్వ శాఖలు గుర్తిస్తే బాగుంటుంది.

## ● సంక్షిప్తంగా..

**కరీంనగర్ రూరల్:** భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు ఈ నెల 27న సాయంత్రం 4గంటలకు కరీంనగర్‌లోని మధు గార్డెన్‌లో ప్రారంభమవుతాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి, గుంటూరుపల్లి, నగునూర్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కరపత్రాలను విడుదల చేశారు.

**భగత్‌నగర్:** మండలంలోని కమాన్‌పూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ శనివారం పంపిణీ చేశారు.

**కరీంనగర్ కల్చరల్:** బదరీనాథ్ క్షేత్రంతోపాటు సరస్వతీ నది జన్మస్థల మైన మానాలో కరీంనగర్‌కు చెందిన డాక్టర్ కాసం శివకుమార్, డాక్టర్ కాసం నీలిమ వైద్యులు ఉచిత వైద్య సేవలందించి ప్రశంసలందుకున్నారు. 12వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వైద్య సేవలందించారు.

**సుభాష్‌నగర్:** సేంద్రీయ వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శనివారం ఉత్తమ రైతు బొప్ప శ్రీహరి ఆర్డీవోకు సేంద్రీయ పద్ధతిన పండించిన మామిడిపండ్లను అందజేశారు.

**భగత్‌నగర్:** రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జన్మదినం సందర్భంగా మే 8 నుంచి దేశ సైనికుల సంక్షేమ నిధి కోసం చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమం శనివారం ముగిసింది. నందెల్లి ప్రకాశ్ మాట్లాడుతూ ఈ విరాళాల ద్వారా సేకరించిన మొత్తాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

భగత్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు అన్నారు. అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌లో ఐదు రోజులుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండోదశ వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో వారి పాత్ర విశిష్టమైందన్నారు. అనంతరం అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డిని సన్మానించారు. కోర్సు సమన్వయకర్త అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి,ఎంఈవోలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

గణేశ్‌నగర్, మే24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న మధ్య భారత మహారాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిద్దామని రాష్ట్ర గొర్రెల మేకల పెంప కందారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర కన్వీనర్ కదారి అయిలన్న కురుమ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భర్త యుద్ధంలో, మామ వృద్ధాప్యం, కుమారుడు అనారోగ్యంతో మరణించారని, దీంతో రాజ్యంలోని ప్రజల బాగోగుల కోసం బాధ్యతలు చేపట్టారని కొనియాడారు.

## పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుండేటి శ్రీనివాస్ రెడ్డి కేక్ కట్ చేశారు. నాయకులు అక్బర్, దన్నాసింగ్ ఉమాపతి, అంజయ్య, సుదర్శన్, జీడి రమేష్, అస్తపురం రమేష్, పెద్దిగారి తిరుపతి పాల్గొన్నారు.

**గణేశ్‌నగర్:** నగరంలోని ఇందిరాచౌక్ వద్ద పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొన్నం సత్యం, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి సీనియర్ కాంగ్రెస్ మైనారిటీ నేత రహమత్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్, వన్, టూ, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు శనివారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఫారెస్ట్ ఆఫీస్, జైలు పెట్రోల్ పంపు, సీపీ కార్యాలయం, కేఎస్‌ఆర్ క్లబ్, వేంకటేశ్వర ఆలయం, ఉదయం 9 గంటల నుంచి 10 వరకు ఐబీ చౌరస్తా, సర్కస్ గ్రౌండ్, సెవెన్ హిల్స్ పాత డీఐజీ బంగ్లా నీటి ట్యాంక్ ఏరియా, చెన్నై షాపింగ్ మాల్ ఫ్రంట్ ఏరియా, శ్రీలత టవర్ ఏరియా, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, చెర్లబూత్కూర్, చామన్‌పల్లి, దుబ్బపల్లి, ఫకీర్‌పేట్, జూబీనగర్, బహదూర్‌ఖాన్‌పేట్, తహెర్ కొండాపూర్, ఎలబోతారం తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

## చదరంగం పోటీలకు స్పందన



పతకాలు ప్రదానం చేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి

కరీంనగర్ స్పోర్ట్స్, మే 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీలో అండర్-11 బాలబాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోలీస్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధస్సును పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైనవారు ఈ నెల 30, 31, జూన్ 1వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. విశ్వనాథ్ అకాడమీ డైరెక్టర్ విశ్వనాథ్ ప్రసాద్, చీఫ్ ఆర్బిటర్ సీహెచ్ శ్రీనివాస్, డిప్యూటీ ఆర్బిటర్ కొప్పర్తి శివయ్య పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు ఉన్నతి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కల్పిస్తున్న శిక్షణ, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మాలతి శనివారం తెలిపారు. కళాశాలలో 30 రోజులపాటు ఆయా రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన 18 నుంచి 25 మధ్య వయస్సు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈనెల 30లోపు 7995010675 నంబరులో వివరాలు తెలపాలని సూచించారు.

## ట్రినిటిలో ముగిసిన ప్లేస్‌మెంట్ డ్రైవ్



క్యాంపస్ ప్లేస్ మెంట్ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కరీంనగర్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ శనివారం ముగిసింది. డ్రైవ్‌లో డ్రైవ్‌లో 212 మంది విద్యార్థులకుపైగా ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ట్రినిటి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు దాసరి మనోహర్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్ పాల్గొన్నారు.

## టీచర్స్, లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న మాసం రత్నాకర్

సుభాష్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా చెన్నమల్ల చైతన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్ల రాజేశ్వర్ తెలిపారు. శనివారం నగరంలోని తారక హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న చైతన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అనంతరం చైతన్య మాటాడుతూ టీచర్ల, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మాసం రత్నాకర్, వంగపల్లి రాజేశ్వర్, సము ద్రాల లింగారావు, ఊట్కూరి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆధునిక వైద్యంతో ప్రాణ నష్టం తగ్గించవచ్చు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యంతో ప్రాణ నష్టం తగ్గించవచ్చని పాండిచ్చేరికి చెందిన కారికల్ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయర్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ తానాకాన్-2025 రాష్ట్ర సదస్సును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న మార్పులతో తక్కువ సమయంలో మెరుగైన వైద్యం అందించగలమన్నారు. తానాకాన్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్, తానా స్టేట్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కఠారి, డాక్టర్లు మంగీలాల్, సునీల్‌రెడ్డి, మహేశ్, సూర్యనారాయణరెడ్డి, జగన్‌మోహన్ రావు, బీఎస్ రావు, విజేందర్‌రెడ్డి, టీకేకే నాయుడు, లక్ష్మణ్, రఘురాం, విజయ్‌మోహన్‌రెడ్డి, శ్రీలత, శైలజ, మమతారెడ్డి, నరేంద్ర, జయరాం, శైలజ, శేషశైలజ, రవికాంత్, రమణాచారి, రామ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల భవన్‌లో శిక్షణకు స్పందన

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): బాల భవన్‌లో వివిధ అంశాల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణకు స్పందన లభిస్తోంది. వేసవిలో విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు కలెక్టర్, విద్యాశాఖ సహకారంతో ఏటా బాలభవన్ శిక్షణ అందిస్తున్నారు. అంబేద్కర్ స్టేడియంలో ఏప్రిల్ 24 ప్రారంభమైన శిక్షణ తరగతులు జూన్ 10వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం 950 మంది చిన్నారులు హాజరవుతున్నారు. చిన్నారులు, తల్లిదండ్రుల నుంచి వస్తున్న స్పందనకు సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి కృతజ్ఞ తలు తెలిపారు. బాలభవన్ ద్వారా మానసిక, శారీరక, వ్యక్తిత్వ, నైపుణ్య వికాసాల కోసం ఇస్తున్న శిక్షణను వినియోగించు కోవాలన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/చొప్పదండి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలాల్లోని ప్రభుత్వఉన్నతపాఠశాలలో ఐదురోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవోలు శ్రీనివాస్, రాములు, మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ సామర్థ్యనిర్మాణ శిక్షణకార్యక్రమంపై అవగాహన కల్పించామన్నారు. ఆర్పీలు చెప్పిన ప్రతివిషయాన్ని చక్కగా విని, వాటిని పాఠశాలల్లో అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ ఏడాది బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

## విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

చొప్పదండి, మే 24 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల పూర్వవిద్యార్థులకు ఉన్నతి ఫౌండేషన్ ద్వారా నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వాతి ఒకప్రకటనలో తెలిపారు. 18నుంచి 25సంవత్సరాల వయస్సున్న విద్యార్థులు దీనికి అర్హులన్నారు. 40రోజులపాటు ఈశిక్షణకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు ఈనెల 30లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## రాజీవ్ యువశక్తికి 2644 దరఖాస్తులు

చిగురుమామిడి, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్‌యువశక్తి పథకానికి మండలవ్యాప్తంగా 2644మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. కానీప్రభుత్వం మంజూరు చేసింది 213 యూనిట్లు మాత్రమే. అధికారులు, అధికారపార్టీ నాయకులు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా యూనిట్లు అందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రజక సంఘం జిల్లా కార్యదర్శిగా సమ్మయ్య



సమ్మయ్య

గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికిచెందిన లింగంపల్లి సమ్మయ్య రజకసంఘం జిల్లా కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు పూసాల సంపత్ శనివారం నియామకపత్రాన్ని సమ్మయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్రఅధ్యక్షుడికి, లీగల్‌అడ్వైజర్ లింగంపల్లి నాగరాజుకు, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళితబంధు నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో దళితబంధు సాధనసమితి ఆధ్వర్యంలో శనివారం దళితబంధు రెండోవిడత నిధులు విడుదల చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నిరసన తెలపగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దళితబంధు సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ మే30లోపు గ్రౌండింగ్ మొదలు పెట్టకపోతే 5వేల మందితో కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరేష్, రవీందర్, రాజేష్, వంశీ, ఆకాష్, సౌజన్య, కోమల, సమ్మక్క, సరిత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

గంగాధర, మే 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం అన్నదాతకు తీవ్రనష్టం చేకూర్చింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దవగా, మరికొంత మొలకెత్తింది. మండలంలోని ర్యాలపల్లి, నర్సింహులపల్లి, రంగరావుపల్లి గ్రామాల్లో మూడురోజులుగా కురుస్తున్న వర్షానికిధాన్యం తడిసిమొలకెత్తింది. రంగరావు పల్లిలో తూకంవేసిన బస్తాలు అకాలవర్షానికి తడవగా రైతులకు నష్టం జరగకుండా అధికారులు బాయిల్ మిల్లుకు పంపించారు.

# మీ పార్టీల సంగతి మీరు చూసుకోండి

**● బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

తిమ్మాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): మీ పార్టీల సంగతి మీరు చూసుకోండి, మాపార్టీ సంగతి మేము చూసుకుంటాం అని బీఆర్ఎస్‌పార్టీ జిల్లాఅధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత రాసిన లెటర్‌ను కొందరు రాజకీయం చేస్తున్నారని అన్నారు. అసలు లెటర్ ఎలా లీక్ అయిందనే సమస్య తప్ప ఇంకేలాంటి సమస్యలేదని అన్నారు. దీన్ని ఈప్రాంతానికి చెందిన కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రమే సమస్యగా తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పీసీసీ మహిళా అధ్యక్షురాలు పీసీసీ గేటు ముందు కూర్చొని ధర్నా చేస్తూ నువ్వు పదవులు ఇస్తలేవు అమ్ముకుంటున్నవు అని ఆరోపిస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం స్పందించలేదని అన్నారు. కేంద్రంనుంచి రాష్ట్రానికిబడ్జెట్‌లో ఎందుకు ఒక్కరూపాయి కూడా నిధులు తీసుకురాలేదని మంత్రి బండి సంజయ్‌ను ప్రశ్నించుకోండి, అంతేగాని తమ బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడడం మానుకోండని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బుల వసూళ్లు

**● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లపేరుతో కాంగ్రెసోళ్లు డబ్బులు వసూలు చేస్తున్నారని మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో జిల్లాఅధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్రనాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా 42వేలమంది ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొదటి దఫాలో కేవలం 3500ఇళ్లు మాత్రమే మంజూరైనట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ అంటున్నారని, అవికూడా ఏవిధంగా అందజేస్తారో అని ప్రశ్నిం చారు. రూ.50వేలు కొట్టు ఇల్లు పట్టు అనేనినాదంతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇళ్ల కోసం డబ్బులు వసూలు చేసినట్లు తనవద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని అన్నారు. ఫోన్‌లో డబ్బులు పంపించినట్లు స్క్రీన్‌షాట్లు కూడా ఉన్నాయని సమయం వచ్చినప్పుడు వాటిని బయట పెడతానన్నారు. నిజాయితీగా పెదవారికి ఇల్లు ఇచ్చేది ఉంటే గ్రామసభ పెట్టి వారిపేర్లను ప్రకటించాలన్నారు. అలాగాక ఇలానే డబ్బులు వసూలు చేస్తే దరఖాస్తుదారులతో కలిసి రాబోయే రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## అవీ..ఇవీ..

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్‌ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కరీంనగర్ షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీటీమ్ సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీఐ శ్రీలత మాట్లాడుతూ అమ్మాయిలు నమ్మి ఎవరికీ ఫొటోలు పంపవద్దన్నారు. సమస్య లుంటే షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

**హుజూరాబాద్:** హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన మౌనిక(32) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబసభ్యులు నేత్రదానం చేయడానికి అంగీకరించారు. ఎల్వీప్రసాద్‌నేత్ర సేకరణ టెక్నీషియన్ లక్ష్మణ్ మృతిరాలి కార్నియా సేకరించారు.

-దళితబంధు కోసం ఉద్యమిస్తున్న నాయకులపై కేసులు పెట్టడం, అరెస్టు చేయడం సరైన నిర్ణయం కాదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిశోర్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లోఆయన మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్2తేదీ లోపు రెండో విడత దళితబంధు నిధులు ఇవ్వాలని, లేనియెడలరాష్ట్ర వ్యాప్తంగా రాజకీయపార్టీలు, దళితప్రజా సంఘాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**ఇల్లందకుంట/జమ్మికుంట:** మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీసీనియర్ నాయకుడు వంగరామకృష్ణ, జమ్మికుంటలోని గాంధీచౌరస్తా వద్ద పార్టీ పట్టణాధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

**గంగాధర:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చొప్పదండి టీడీపీకి కంచుకోటని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కళ్యాడపు ఆగయ్య అన్నారు. శనివారం గంగాధరలో ఆయన మట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

- మండలంలోని మధురానగర్ సురభి పాఠశాలవిద్యార్థులు ఎండీఅసరార్ ఆయాన్ 106వ, హరికిషన్396వర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్‌వీరనర్సయ్య తెలిపారు.

**రామడుగు:** కొక్కెరకుంటకిచెందిన గుల్లపల్లి అభినయకు ఇంజనీరింగ్ చదవడానికి హెల్పింగ్‌హ్యాండ్స్ (ఎన్ఆర్,యూఎస్ఏ) సహకారంతో రైజింగ్‌సన్ యూత్‌క్లబ్ సభ్యులు ఆర్థికసహాయం అందజేశారు. మొదటి విద్యాసంవత్సరానికిగాను రూ.10 వేలు అందించినట్లు క్లబ్‌అధ్యక్షుడు గజ్జెల అశోక్‌తెలిపారు.

## కుంగిన చెరువు కల్వర్టు

గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు వద్ద కల్వర్టు రెండువైపులా కుంగి ప్రమాదకరంగా మారిందని వెంటనే కల్వర్టు వద్ద హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక యువజన నాయకులు శనివారం అధికారులను కోరారు. వర్షాకాలం సమీపిస్తున్నందున చెరువు నిండితే కుంగిన కల్వర్టు కొట్టుకుపోయే పరిస్థితి ఉందని, అలా జరిగితే చెరువు కట్టకే ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంటనే అధికారులు స్పందించి గన్నేరువరం చెరువు కల్వర్టు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

## ఆపరేషన్ సిందూర్.. సైన్యం ధైర్యానికి నిదర్శనం: గంగాడి కృష్ణారెడ్డి



చొప్పదండిలో జరిగిన తిరంగాయాత్ర

చొప్పదండి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ భారతసైన్యం ధైర్యానిని, తిరుగులేని శక్తికి, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం చొప్పదండిలో జరిగిన తిరంగాయాత్రలో ఆయనపాల్గొని ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ 140కోట్ల భారతీయులకు గర్వకారణమని, సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని, వారికిశిరస్సు వంచి వందనాలు తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బొడిగెశోభ, బీజేపీజిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, చేపూరి సత్యనారాయణ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్‌సీసీ అడ్వాన్స్ లీడర్ షిప్ క్యాంప్



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మాజీఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంప్ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు సభకు మాజీఎమ్మెల్యే, కళాశాల సెక్రెటరీ వొడితెల సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణ యువత చేతిలో ఉందన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, అంకితభావం ఏర్పడుతుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ కెడెట్లకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్, ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబు, కల్నల్ కృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, సూర్యప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు ఉన్నారు

## ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నారాయణరెడ్డి

హుజూరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నల్లా నారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సూపరిం టెండెంట్ రాజేందర్‌రెడ్డిని హైదరాబాద్‌కు బదిలీ చేయగా, నారాయణరెడ్డిని నియమించారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించగా, వివిధ సంస్థల ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.